రంగు పడితే ఓకే..!

- అక్రమ నిర్మాణాలకు వంతపాడుతున్న జోన్ – 3 యంత్రాంగం
- చర్యలు గాలికొదిలేసి.. త్వరితగతిన రంగులు వేసుకోవాలంటూ సూచనలు
- వివాదాస్పదమవుతున్న టౌన్ ప్లానింగ్ విభాగం తీరు
- ఏడాదిగా ఒక్క అక్రమ నిర్మాణంపైనా చర్యలు తీసుకోని వైనం
- అన్నీతామై తెరవెనుక వసూళ్లకు పాల్పడుతున్న ఏసీపీ బినామీలు
- ఫిర్యాదుల నేపథ్యంలో నోటీసులతో చేతులు దులిపేసుకుంటున్న వైనం



సెక్టార్ - 1లో నిర్మాణం పూర్తి కాకుండానే రంగు వేసేసిన ఓ కమర్షియల్ భవనం



సెక్టార్ - 6లో ఇరుకు రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం



ఎంవీపీ సెక్టార్ - 6 బుద్ధవనం ఎదుట నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనానికి రంగులు వేసేసిన దృశ్యం

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ జోన్ – 3 టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు వార్డుల్లో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా ఆ విభాగం వాటిపై చర్యలకు కన్నెత్తి చూడకపోవడమే ఇందుకు కారణం. పైగా ఆయా అక్రమ నిర్మాణదారుల నుంచి కాసులు దండుకుంటూ వాటికి కొమ్ముకాస్తున్నట్లు సర్వాత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. జోన్ - 3 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నుంచి వార్డు ప్లానింగ్ కార్యదర్శుల వరకు అంతా ఇదే తీరు ప్రదర్శిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతోపాటు ఏసీపీ నియమించుకున్న కొందరు బినామీలు నిత్యం బిల్డర్లతో మంతనాలు జరుపుతూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే ఆయా అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నా నోటీసులిచ్చాం, చర్యలు తీసుకుంటాం అంటూ ఆ విభాగ అధికారులు కాలం గడపుతున్నారు. ఇందులో భాగంగానే లంచాలు సమర్పించిన అక్రమ నిర్మాణదారులకు కొమ్ముకాస్తూ త్వరితగతిన వారి భవనాలకు రంగులు వేసుకోవాలంటూ సూచించడంతోపాటు బిల్డర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇలా పెద్ద ఎత్తున వినిపిస్తున్న ఆరోపణలు జోన్ - 3 టౌన్‌ప్లానింగ్ విభాగం అవినీతి దందాకు అద్దం పడుతున్నాయి.

గత ఏడాదిగా చర్యలు శూన్యం

జోన్–3 పరిధిలో గత ఏడాది కాలంగా వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరిగాయి. ఎంవీపీ కాలనీ, లాసన్స్ బే కాలనీ, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ, పెదవాల్తేర్, ఈస్ట్ పాయింట్ కాలనీల్లో ఇలాంటి భవనాలు పెద్ద సంఖ్యలో ఉండగా నాలుగు, ఐదు అంతస్తులకు అనుమతులు లేకుండానే నిర్మాణాలు సాగిస్తున్నారు. అయితే ఆయా నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నా టౌన్‌ప్లానింగ్ ఏసీపీతోపాటు ఇతర అధికారులు పట్టించుకోవడం లేదు. ముడుపులు అందడం వల్లే చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఫిర్యాదులు అందుతున్న ఆయా నిర్మాణాలకు త్వరితగతిన రంగులు వేసుకోవాలని, లేకుంటే సమస్యలు తలెత్తుతాయని టౌన్‌ప్లానింగ్ అధికారులే సూచిస్తున్నారు. పలు పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో కొందరు బిల్డర్లపై వారు ఒత్తిడి సైతం తీసుకొస్తున్నాట్లు సమాచారం. దీంతో చాలా అక్రమ నిర్మాణాల్లో కనీసం పనులు పూర్తికాకుండానే రంగులు వేసేస్తున్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ - 6లోని బుద్ధవనం ఎదుట నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణానికి ఇదే తరహాలో రంగులు వేశారు. దీంతో పాటు దాని వెనుక వీధిలో ఇరుకు రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనానికి, ఎంవీపీ సెక్టార్–1 మెయిన్ రోడ్డులో నిర్మితమైన మరో కమర్షియల్ భవనానికి, ఎంవీపీ కాలనీ సెక్టార్ - 6లోని మరో నిర్మాణానికి ఇదే తరహాలో రంగులు వేశారు. ఈ తరహా నిర్మాణాలు జోన్ - 3 పరిధిలోని అన్ని వార్డుల్లో పదుల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. అయితే బయట ఎలివేషన్‌తోపాటు లోపల ఇంకా పనులు జరుగుతున్న ఆయా నిర్మాణాలకు రంగులు వేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు ఆయా నిర్మాణాల్లో ఒక్కదానికి కూడా యూసీ మంజూరు కాకపోవడం గమనార్హమంటూ పలువురు పేర్కొంటున్నారు. ఆయా అక్రమ నిర్మాణాలు నాలుగు నుంచి ఐదు అంతస్తుల్లో ఇరుకు రోడ్లలో, కమర్షియల్ తరహాల్లో జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోకుండా అధికారులు కొమ్ముకాస్తున్నట్లు పేర్కొంటున్నారు.

రంగులేసినా చర్యలు తీసుకుంటాం



జోన్ - 3 పరిధిలో అక్రమ నిర్మాణాలపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలిస్తున్నాం. ప్లానింగ్ కార్యదర్శులతో నోటీసులు జారీ చేయిస్తున్నాం. ఆయా నిర్మాణాల ఎదుట నోటీసులు సైతం అంటిస్తున్నాం. అక్రమ నిర్మాణాలకు రంగులు వేసుకోవాలంటూ మా సిబ్బంది సూచిస్తున్నారనే దాంట్లో వాస్తవం లేదు. నిబంధనల ప్రకారం రెండు, మూడు నోటీసులు ఇచ్చిన తర్వాతే చర్యలు తీసుకుంటాం. నిర్మాణం అక్రమం అని తెలిస్తే రంగులు వేసినా కూడా ఆ నిర్మాణంపై చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది ఎన్ని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నామనే విషయాన్ని పరిశీలించి తెలియజేస్తాం.

– మధుసూదన్‌రావు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, జోన్ – 3

జాతీయ నంది పురస్కారానికి ఎర్రయ్య ఎంపిక

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు పరిధి పెదగదిలికి చెందిన సింగూరు ఎర్రయ్య జాతీయ నంది పురస్కారానికి ఎంపికయ్యారు. భజన గాయకుడిగా, డోలక్ వాయిద్యకారుడిగా అందించిన సేవలకు తనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆదివారం ఆయన తెలిపారు. కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అందజేయనున్న పురస్కారానికి తనను ఎంపిక చేసినందుకు ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 12న హైదరాబాద్ చిక్కడపల్లిలో ఆయా సంస్థ ల ద్వారా తాను పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

మద్దిలపాలెం : భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆంధ్ర యూనివర్సిటీలో గల ఆయన విగ్రహానికి ఏయూ వీసీ జి.పి.రాజశేఖర్ ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి జగ్జీవన్ రామ్ అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, లా కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సీతా మాణిక్యం, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజా శంకర్, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మశ్రీ,, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగ రాజ కుమారి, దూరవిద్య సంచాలకులు డీఏ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శంకర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



శంకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మొల్లి అప్పారావు, తదితరులు

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 17వ వార్డు సీనియర్ నాయకుడు, కరకచెట్టు పోలమాంబ ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు నేతృత్వంలో స్థానిక నాయకులు పెదవాల్తేరులోని ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ గత కొంతకాలంగా శంకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని పార్టీ తరపున భరోసా కల్పించినట్లు తెలిపారు. ఆయన త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముువ్వల సురేష్, 17వ వార్డు అధ్యక్షుడు నీలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ జాతర రేపు



మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలోని శ్రీ సీతారామ సేవా మండలి ఆధ్వర్యంలో ఈ నెల 8న కనకమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం చాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అర్చకులు తులగపు వెంకటరమణ, తులగపు రవి శాస్త్రి విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం కమిటీ సభ్యులు పాత వెంకోజీపాలెం శ్రీ సీతారామ సేవా సంఘం, కొత్త వెంకోజీపాలెంలోని గ్రామ సేవా సంఘం సభ్యులకు ఉత్సవ ఆహ్వాన పత్రికలు ఇచ్చారు. శ్రీ సీతారామ సేవా సంఘం నుంచి అధ్యక్షుడు కర్రి వెంకట అప్పారావు, ఉపాధ్యక్షుడు పెంటకోట ప్రకాష్ ఆహ్వాన పత్రిక అందుకున్నారు. శ్రీ సీతారామ సేవా మండలి అధ్యక్షులు కోరిబిల్లి త్రినాథ్, ఉత్సవ కమిటీ సభ్యులు కోరిబిల్లి త్రినాథ్ శివ సత్యబాబు, మద్ది శశిభూషణరెడ్డి, సూరిశెట్టి అప్పలరాజు, సూరిశెట్టి సత్యనారాయణ, పెంటకోట రమేష్, సూరిశెట్టి చిన్నబాబు, రాపేటి గోవింద రాజు పాల్గొన్నారు.

హామీ మేరకు వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

డాబాగార్డెన్స్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు మినిమం టైం స్కేల్, ఒకే కేడర్ ఉద్యోగులకు ఒకే వేతనం అమలు చేయాలని ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఛైర్మన్ దయామణి డిమాండ్ చేశారు. సిటు కార్యాలయంలో ఆదివారం ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా ఛైర్మన్ సురేష్ నేతృత్వంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 22 వేల మంది నేషనల్ హెల్త్ మిషన్‌లో ఉద్యోగులు 198 కేడర్లలో గత దశాబ్దన్నర కాలంగా అత్యంత తక్కువ వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. వారికి సమాన పనికి సమాన వేతనం, సమాన సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ గౌరవ ఛైర్మన్ ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్ రద్దు చేసి 12 గంటల పని విధానాన్ని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మెడకు ఉరికొయ్యిలా తగిలించి, కార్మిక, కర్షక, విధానాలు తుంగలో తొక్కడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం కొనుగోలు నిమిత్తం విజయవాడకు చెందిన కెవీఎల్ హరినాథ్ రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందించారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ఆచార్యులుకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు రశీదు అందించారు. ఆలయ ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు



తులసి మాలల అలంకరణలో స్వామి

ఏయూ క్యాంపస్: ఆషాఢ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని బీచ్ రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం రుక్మిణి సమేత పాండురంగ స్వామికి అర్చకులు కె.శ్రీరామ మూర్తి పంచామృత అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు, అష్టోత్తర అర్చన జరిపా రు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తుల స్వహస్తాలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో ఎ.దేవుళ్లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

లక్ష్మీ గణపతి ఆలయంలో...

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పరిధి శివాజీపాలెంలో గల శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పూజలు చేశారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద దీపాలంకరణ చేశారు.



లక్ష్మీ గణపతి ఆలయంలో దీపాలంకరణలో భక్తులు

వేంకటేశ్వర స్వామికి తులసీ దళార్చన

మద్దిలపాలెం : తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఎంఎంటీసీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వెంకన్నస్వామికి విష్ణు పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని తులసీ దళాలతో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి దర్శనానికి భక్తులు రోడ్డుపై బారులు తీరారు. అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకష్ణ ఆచార్యులు, వంశీ ఆధ్వర్యంలో భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి టి.సుబ్బారాయుడు, మేనేజర్ బి.సన్యాసిరావు పాల్గొన్నారు. అదేవిధంగా కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, ఇసుకతోట వెంకన్నస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు.

బార్ అండ్ రెస్టారెంట్లకు సమయపాలన తప్పనిసరి

అల్లిపురం: బార్ అండ్ రెస్టారెంట్, మద్యం దుకాణాల యాజమాన్యం, సిబ్బంది సమయపాలన పాటించాలని టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు సూచించారు. ఆదివారం బార్ అండ్ రెస్టారెంట్, మద్యం దుకాణాల యాజమాన్యం, సిబ్బందితో ఆయన స్టేషన్ ఆవరణలో సమావేశమయ్యారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోమని, బార్ అండ్ రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల పుటేజీ కూడా సేవ్ చెయ్యాలన్నారు, అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే ఊరుకోమని హెచ్చరించారు. సెటిల్‌మెంట్లు తదితర కార్యక్రమాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకే బార్ అండ్ రెస్టారెంట్లు నిర్వహించాలని, రాత్రి 11 గంటల తర్వాత మద్యం సరఫరా చేయకూడదన్నారు. మద్యం దుకాణం ముందు మద్యం సేవించరాదన్నారు. అలా చేసినట్లయితే యాజమాన్యంపై చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. బార్, మద్యం దుకాణల ముందు కొట్లాటలు జరిగినా, వివాదాలు చెలరేగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన మద్యం దుకాణాల యాజమాన్యాలకు సూచించారు.

అన్నార్తులకు ఆహారం పంపిణీ

కంచరపాలెం: దళిత సేన ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన కింద, జ్ఞానాపురం రైల్వే స్టేషన్, దొండపర్తి, తాటిచెట్లపాలెం, మర్రిపాలెం, ఎన్ఏడీ తదితర ప్రాంతాల్లో అన్నార్తులకు సామాజిక వేత్త, దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆహారం పొట్లాలు పంపిణీ చేశారు. సుమారు 450 మందికి ఆహారం అందజేశారు. ఆకలితో ఉన్న అభాగ్యులకు సహాయం చేయడానికి ఎల్లవేళలా ముందుంటానని అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో దళిత సేన నగర కన్వీనర్ మీనా, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, నగర సెక్రటరీ పట్నాల ఝూన్సీ, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన పోలీస్ స్టేషన్ బ్రిడ్జి నిర్మాణం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు రహదారి ఏర్పాటులో భాగంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెలలు గడిచినా పనులు మాత్రం ఇంకా భూమి లోపలే ఉన్నాయి. విమ్స్‌కు చెందిన ఖాళీ స్థలంలో బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని ఆరిలోవ పోలీస్ స్టేషన్ కొద్ది నెలల కిందట నిర్మించారు. ఈ స్టేషన్ సుమారు 10 నెలల క్రితం అందుబాటులోకి వచ్చింది. దీనికి ప్రత్యేకంగా రహదారి లేదు. దీంతో జీవీఎంసీ అధికారులు ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి పక్క నుంచి బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు మీదుగా రహదారి నిర్మాణం చేపట్టారు. పోలీస్ స్టేషన్, బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్యలో గెడ్డ అడ్డంగా ఉండడంతో దానిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి వచ్చింది. ఈ బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించి సుమారు 8 నెలలు గడుస్తున్నాయి. అయినా ఇంతవరకు కాంక్రీట్ స్థాయిలోనే ఉన్నాయి. దీని రహదారి పనులు ప్రారంభించినప్పుడే అధికారులు ఆరు నెలల్లో రహదారి, బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందని ప్రణాళిక వేసినట్లు తెలిపారు. ప్రారంభించినప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇంతవరకు సుమారు 40 శాతం పనులు కూడా జరగలేదని పోలీసులు అంటున్నారు. ఇలాగే పనులు సాగితే ఈ రహదారి అందుబాటులోకి రావడానికి మరో ఏడాది పడుతుందని భావిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేకంగా రహదారి లేకపోవడంతో విమ్స్ ద్వారం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారి పనులు పూర్తయితే విమ్స్ ప్రాంగణంలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా బీఆర్‌టీఎస్ నుంచి పోలీస్ స్టేషన్‌కు చేరుకోవచ్చు.



ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి పక్కన గెడ్డపై నిర్మిస్తున్న బ్రిడ్జి

ఫిల్మ్ సొసైటీతో విడదీయరాని అనుబంధం

బీచ్‌రోడ్డు : సినిమా అనేది ఒక గొప్ప ప్లాట్‌ఫామ్ అని, దానిని సరైన మార్గంలో వినియోగించుకోవాల్సిన అవసరం ప్రస్తుత తరానికి ఉందని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఎంవీ రఘు పేర్కొన్నారు. సినిమాటోగ్రాఫర్‌గా ఎంవీ రఘు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సిరిపురంలోని బిల్డర్ అసోసియేషన్ హాల్లో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంవీ రఘు మాట్లాడుతూ 50 ఏళ్లుగా సినిమా రంగంలో సేవలందిస్తున్న తనకు ఫిల్మ్ సొసైటీతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. హైదరాబాద్ వంటి నగరంలో సినిమా అంటే ఏంటి, సినిమాటోగ్రాఫర్‌కు ఉండాల్సిన ప్రధానాంశాలపై యువతకు సలహాలు ఇస్తున్నామన్నారు. కళ్ళు వంటి చిత్రానికి సినిమాటోగ్రఫీనే కాకుండా, దర్శకత్వం కూడా వహించానన్నారు. భవిష్యత్తులో మంచి సినిమాల కోసం తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశ రావు మాట్లాడుతూ మంచి సినిమాను ప్రేక్షకులకు అందించడమే కాకుండా దానికి దోహదపడ్డ వ్యక్తులను సినీ ప్రియులకు దగ్గర చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి బి.చిన్నారావు, ఉపాధ్యక్షులు కృష్ణారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివ కుమార్, జ్ఞానేశ్వర్ బాబ్జి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినిమాటోగ్రాఫర్ రఘు

ఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలి

వెటర్నరీ జేడీ డాక్టర్ కరుణాకర్‌రావు



వ్యాక్సిన్ వేస్తున్న జేడీ డాక్టర్ కరుణాకర్‌రావు

మద్దిలపాలెం : పెంపుడు శునకాలకు క్రమం తప్పకుండా ఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలని పశు వైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్‌రావు సూచించారు. ఇసుకతోట పశు వైద్య కేంద్రంలో ఆదివారం ప్రపంచ జునోసిస్ డేను పురస్కరించుకుని పెంపుడు శునకాలకు వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు అతి త్వరగా వచ్చే వ్యాధి రేబిస్ అన్నారు. పెంపుడు కుక్కలు మనుషులకు అతి సన్నిహితంగా ఉంటాయి కనుక వాటి నుంచి త్వరగా రేబిస్ సోకుతుందన్నారు. జీవీఎంసీ సిబ్బంది వీధి కుక్కలకు సంక్షేమ ఆపరేషన్లు చేస్తున్నారని, యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు కూడా వేస్తున్నారన్నారు. జేడీ కార్యాలయం వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రసాదరావు వైద్య కేంద్రం డాక్టర్ ఎస్.జి.ప్రశాంతి మాట్లాడుతూ నగర పరిధిలోని అన్ని పెంపుడు కుక్కలకు యజమానులు విధిగా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా 224 శునకాలకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో వైద్య కేంద్రం సిబ్బంది కరుణ, అప్పన్న పాల్గొన్నారు.



తోటగరువు వెటర్నరీ ఆస్పత్రికి కుక్కలను తీసుకొచ్చిన పెంపకందారులు

తోటగరువులో 250 కుక్కలకు రేబిస్ టీకాలు

ఆరిలోవ : చినగదిలి మండలం తోటగరువు పశు వైద్యశాలలో ఆదివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ఎస్.కరుణాకరరావు పాల్గొని పశు వైద్యులు, కుక్కల పెంపకందారులకు రేబిస్‌పై అవగాహన కల్పించారు. జునోసిస్ వ్యాధుల వల్ల కలిగే అనర్థాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, టి.ఐ.సి. పాయింట్, బాలాజీనగర్, పెదగదిలి, చినగదిలి, రవీంద్రనగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన సుమారు 250 కుక్కలకు రేబిస్ టీకాలు ఉచితంగా వేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఆస్పత్రి పశు వైద్యుడు డాక్టర్ ఎ.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన కామెడీ షో



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రతి నెలా మొదటి ఆదివారం నిర్వహించే వినోదాల విందు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించిన కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, పోర్టు శేషు, కుమారి, పుష్యమి, నాయుడు, రామానుజం, భానుప్రకాష్, సూర్యం, శివజ్యోతి, రాగస్‌నాయుడు, నరసింహారావు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు ఆహూతులను కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో సర్దుకు పోదాం రండి, స్విమ్మింగ్‌పూల్, జామచెట్టు, తాగుబోతు, కోడిపందాలు, డాక్టర్ పేషెంట్, డ్రైవర్ జాబ్, ప్రశాంతత, రెండు వేల నోటు స్కిట్స్ నవ్వుల్లో ముంచెత్తాయి. ముందుగా వాగ్దేవి నృత్యాలయం గురువు సౌందర్య సురేష్ శిష్య బృందం హరిప్రియ, జాహ్నవి, వైద్య, మౌనిక, గిరిష్మా చేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో డ్రీం షెల్టర్స్ అధినేత రవిశంకర్, సన్‌మూర్తి, తిలక్ పట్నాయక్, బి.మాల్యాద్రి చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు.

ఇస్కాన్‌లో మార్మోగిన హరి నామస్మరణ

కొమ్మాది: హరే కృష్ణ, హరే రామ నామస్మరణతో సాగరనగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయ్ సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించి, పలు ప్రవచనాలు అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ స్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ రకాల రంగుల పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కీర్తనలు ఆలపిస్తూ, స్వామివారి దర్శనం చేసుకుని పునీతులయ్యారు.



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు